# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 23-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన న్యూఢిల్లీలో కొద్ది సేపటి క్రితం భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశమయ్యింది.
- ❖ భారతదేశం ఉగ్రవాదానికి తలొగ్గదని ఉగ్రదాడికి పాల్పడిన వారిని ఎవరినీ వదలబోమని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు.
- ❖ జమ్ము కాశ్మీర్ లో భద్రతా పరిస్థితిపై త్రివిధ దళాల ఉన్నతాధికారులతో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు సమావేశమయ్యారు.
- ❖ ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా ప్రకటించింది.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం 121వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

======================

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిపై న్యూఢిల్లీలోని ప్రధానమంత్రి నివాసంలో భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ కొద్దిసేపటి క్రితం సమావేశమయ్యింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రస్తుత పరిస్థితిని కమిటీ సమీక్షించింది.

======================

పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా నివాళులర్పించారు. ఈరోజు ఉదయం శ్రీనగర్‌కు చేరుకున్న అమిత్ షా.. పుష్పగుచ్ఛం సమర్పించి వారికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం.. బాధిత కుటుంబాలను కలిసి పరామర్శించారు. ఘటన వెనక ఉన్నవారిని వదిలిపెట్టబోమని బాధిత కుటుంబాలతో కేంద్రమంత్రి స్పష్టం చేశారు. భారత్ ఉగ్రవాదానికి తలొగ్గదని ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని ఎవరినీ ఉపేక్షించమని హెచ్చరించారు. బాధితుల ఆవేదనను ప్రతీ భారతీయుడు అనుభవిస్తున్నారని సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు.

=======================

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కాశ్మీర్ లోయలో భద్రతా పరిస్థితిపై త్రివిధ దళాల ఉన్నతాధికారులతో ఈరోజు సమీక్షించారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత ప్రస్తుత భద్రతా పరిస్థితి గురించి ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ త్రిపాఠి, వైమానిక దళ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, ఇతర సీనియర్ అధికారులు రాజ్‌నాథ్ సింగ్ కు వివరించారని రక్షణ వర్గాలు తెలిపాయి. ప్రభావిత ప్రాంతాలకు ఉన్నతాధికారులను తరలించారు. స్థానిక దళాలను అప్రమత్తంగా ఉండాలని, ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలను మరింత ముమ్మరం చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. అనంతరం కేంద్రమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... పహల్గాం ఉగ్రదాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఈ దాడికి భారత్ గట్టి బదులిస్తుందని ఉగ్రవాదులను హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించాలనేది భారత్ విధానమని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

=======================

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రవాదుల దాడిని రాజకీయ పార్టీలకు అతీతంగా నాయకులందరూ తీవ్రంగా ఖండించారు. అమాయక పౌరులను దారుణంగా లక్ష్యంగా చేసుకోవడం చాలా హేయమైన చర్య అని బిజెపి జాతీయ అధ్యక్షులు, కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరిస్థితిని వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారని ఆయన తెలిపారు. ఉగ్రవాదంపై పోరాటంలో దేశం మొత్తం ఐక్యంగా ఉందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అన్నారు. ఈ నిరంకుశ దాడులు మానవాళికి మాయని మచ్చ అని ఆయన సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. ఉగ్రవాదుల దాడిలో పర్యాటకులు మరణించడం, అనేక మంది గాయపడటం హృదయ విదారకమైనదని లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ అన్నారు.

=======================

జమ్ము కాశ్మీర్ లోని పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వం ఒక్కొక్కరికి 10 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా ప్రకటించింది. తీవ్రంగా గాయపడిన వారికి ఒక్కొక్కరికి 2 లక్షల రూపాయలు, స్వల్పంగా గాయపడిన వారికి లక్ష రూపాయలు అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తెలిపారు. బాధితులను వారి స్వస్థలాలకు తరలించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

=======================

జమ్మూ కాశ్మీర్‌లో ఈరోజు సామూహిక బంద్ పాటించారు. పహల్గామ్ లో పర్యాటకులపై జరిగిన దాడులను నిరసిస్తూ... అన్ని వర్గాల ప్రజలు జమ్మూ అంతటా నిరసనలు వ్యక్తం చేశారు. జమ్మూలో పలు సామాజిక, రాజకీయ, వాణిజ్య సంస్థలు వీధుల్లోకి వచ్చి నిరసనల్లో పాల్గొన్నారు. శాంతి భద్రతలను కాపాడటానికి సున్నితమైన ప్రాంతాలలో అదనపు పోలీసులను పారామిలిటరీ దళాలను మోహరించారు. నివాసితులు, బాధితులకు సంఘీభావం తెలుపుతూ ఉగ్రవాదంపై నిర్ణయాత్మక చర్య తీసుకోవాలని పిలుపునివ్వడంతో మార్కెట్లు, రవాణా సేవలు, దుకాణాలు మూసివేయబడ్డాయి. కాశ్మీర్ లోయలో కూడా ఇదే పరిస్థితి కొనసాగింది.

విరామం

=======================

పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత కాశ్మీర్ లో పర్యాటక రంగంపై ఏర్పడిన నష్టాన్ని తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం తన వంతు కృషి చేస్తుందని పర్యాటక శాఖా మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. జమ్మూ కాశ్మీర్ ముఖ్య కార్యదర్శి, పర్యాటక శాఖ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నానని మంత్రి చెప్పారు. ఉగ్రవాదం పట్ల భారత్ జీరో టోలరెన్స్ విధానాన్ని అనుసరిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు.

(వాయిస్ 30 సెకన్లు)

=======================

అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ దాదాపు అన్నీ ప్రపంచ వాణిజ్య భాగస్వాములపై అధిక సుంకాలను విధించడం వల్ల ఏర్పడిన వాణిజ్య యుద్ధానికి ప్రతిస్పందనగా అంతర్జాతీయ ద్రవ్య నిధి (IMF) తన వృద్ధి అంచనాలను తగ్గించింది. చైనా, భారతదేశం, బ్రెజిల్, దక్షిణాఫ్రికాతో సహా ఇతర ప్రధాన ఆర్థిక వ్యవస్థలతో పాటు అన్ని G7 దేశాలకు వృద్ధి అంచనాలను తగ్గించడంతో అమెరికా ఆర్థిక మాంద్యం ప్రమాదాన్ని ఎదుర్కొంటుందని IMF తన వరల్డ్ ఎకనామిక్ అవుట్లుక్ లో హెచ్చరించింది.

=======================

లోక్‌సభ, విధానసభ రెండింటికీ పదే పదే ఎన్నికలు జరుగుతుండటం దేశాభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నందున “ఒక దేశం, ఒకే ఎన్నిక” విధానం అవసరమని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో “ఒక దేశం, ఒకే ఎన్నిక “ అనే అంశంపై జరిగిన ఒక కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి మంత్రి మాట్లాడుతూ... పదే పదే ఎన్నికలు పురోగతికి ఆటంకం కలిగిస్తాయని, దీనివల్ల అన్ని అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోతాయని అన్నారు. ఎన్నికల నియమావళి అమలు ప్రభుత్వ కార్యకలాపాలకు మరింత ఆటంకం కలిగిస్తుందని శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

=======================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్ మనసులోని మాట” కార్యక్రమం 121వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

=======================

పెరూ వేదికగా జరిగిన అంతర్జాతీయ షూటింగ్ స్పోర్ట్ ఫెడరేషన్ (ISSF) ప్రపంచ కప్‌లో భారత్ పతకాల పట్టికలో తన మూడవ స్థానంతో తన ప్రయాణాన్ని ముగించింది. రెండు స్వర్ణాలు, నాలుగు రజతాలు, ఒక కాంస్య పతకాన్ని భారత క్రీడాకారులు గెలుచుకున్నారు. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో సిమ్రన్‌ప్రీత్ కౌర్ బ్రార్ రజత పతకాన్ని గెలుచుకుని భారత ప్రాతినిధ్యాన్ని ఘనంగా ముగించింది. USA కూడా 7 పతాకాలతో ముగించినప్పటికీ, వారు భారతదేశం కంటే ముందుండి రెండవ స్థానంలో నిలిచారు. అధిక స్వర్ణ పతకాల సంఖ్యతో చైనా నాలుగు

స్వర్ణాలు, మూడు రజతాలు, ఆరు కాంస్య పతకాలతో అగ్రస్థానంలో నిలవగా.. అమెరికా మూడవ స్థానంలో నిలిచింది.

=======================

మధ్య మరియు పశ్చిమ భారత దేశంలో ఈ నెల 26వ తేదీ వరకూ వడగాలులు వీస్తాయని భారత వాతావరణ శాఖ IMD తెలిపింది. తూర్పు మధ్యప్రదేశ్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, తూర్పు ఉత్తరప్రదేశ్, బీహార్, ఒడిశాలోని కొన్ని ప్రాంతాల్లో రాబోయే 4 రోజుల్లో వేడిగాలులు వీచే అవకాశం ఉందని IMD  వెల్లడించింది. ఒడిస్సాలో నిన్న అత్యధికంగా 46.2 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదయ్యిందని వెల్లడించింది.

=======================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 79,595 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై... చివరికి 521 పాయింట్ల లాభంతో 80,116 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 161  పాయింట్ల లాభంతో 24,328 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 24 పైసలు బలహీన పడి 85.43గా ఉంది.

=======================
=======================